ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 27 ఏప్రిల్, 2025 | పేజీలు :06

## భూమి ఉన్న ప్రతీ రైతుకు భూ భద్రత కల్పిస్తాం



వివరాలు మెయిన్‌లో...

# కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్రంలో మోడల్‌గా నిలవాలి

క్రీడాకారులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దండి
అభివృద్ధి పనులు త్వరగా పూర్తి
కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**కరీంనగర్‌లోని రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్రంలోనే మోడల్‌గా ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కరీంనగర్‌లోని ఉజ్వల పార్కు సమీపంలో రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సంధర్బంగా స్పోర్ట్స్ స్కూల్ అధికారులకు అభివృద్ధి పనులపై సూచనలు సలహాలు అందజేశారు. ఈ సంధర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. స్పో ర్ట్స్ స్కూల్‌లో చేపట్టిన వివిధ పనులను పరిశీలించారు. స్కూల్‌లో క్రీడాకారులను ఆకట్టుకునేలా మొ క్కలు నాటాలని, అదే విధంగా ఫౌంటేన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. స్వి మ్మింగ్ ఫూల్ దగ్గర మొక్కలు నాటించాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో స్పో ర్ట్స్ స్కూల్ క్రీడాకారులకు తలమానికంగా నిలుస్తుందని, అందుకు తగ్గట్లు అన్ని వి ధాలా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ మోడల్‌గా అత్యుత్తమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఒదకునగుణంగా స్పోర్ట్స్ స్కూల్‌ను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాస్పోర్ట్స్ఆఫీసర్,పిఆర్‌డిఇ తదితరులున్నా రు.

**భవిత సెంటర్లకు గ్రాండ్ లుక్ వచ్చేలా తీర్చిదిద్దండి:**ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లు వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చి దిద్దేలా క్రియేటివిటీని ప్రదర్శించి ఆధునీకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్‌లని ముకరంపురలో ఉన్న భవిత సెంటర్‌ను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సందర్శించారు. జిల్లాలో 16 భవిత సెంటర్లను ఆధునీకరిస్తున్న నేపథ్యంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిత సెంటర్‌లను ఏ విధంగా తీర్చిదిద్దాలి.. ఏ పనులు చేపట్టాలి.. పిల్లలకు ఆకట్టుకునేలా ఆధునీకరించే పనులు చేపట్టాలని పలు సూచనలు చేశారు. ఈ సంధర్బంగా కలెక్టర్ ముకరంపులోని భవిత సెంటర్‌ను మొదట ఒక మోడల్ గా గ్రాండ్ లుక్ ఉండేలా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. భవిత సెంటర్‌లో వాల్ పెయింటింగ్స్, ప్లే వే మెటీరియల్ ఏర్పాటు చేయడంతో పాటు చదువుకోవడానికి, ఆటలాడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలని, అందుకు భవిత సెంటర్ల సిబ్బంది నిరంతరం పాటుపడాలని , సొంత బిడ్డల్లాగా వారిని చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. జిల్లాలోని 16 భవిత సెంటర్లను ఆధునీకరించే పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులో కి తీసుకురావాలని ఆదేశించారు. ఆయా సెం టర్ల అభివృద్ధి కోసం తాము నిరంతరం ముం దుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్ర ఫుల్ దేశాయ్, నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, జిసి డిఒ కృపారా ణి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ , అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సర్జరీ విజయవంతం చేసిన వైద్య బృందానికి అభినందనలు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:**క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఒక మహిళకు ఆరు నెలల క్రితం సీజరియన్ జరిగిందని, అప్పటి నుండి ఆమె అప్పెండిక్స్ తో బాధ పడుతుందని,నిన్న ప్రైవేట్ ఆసుపత్రిలో ఫిజిషియన్ ను సంప్రదించగా ఇది అప్పెండిక్స్ అని చెప్పడము జరిగింది.ఈ క్రిటికల్ కండిషన్ లో ఆ మహిళ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఏప్రిల్ 25న రావడం జరిగిందని, వెంటనే మహిళను చూసి అడ్మిట్ చేసుకొని, ఏప్రిల్ 26న డా. సాయి ప్రసాద్, జనరల్ సర్జన్, డా. అమరసింహ రెడ్డి లాప్రోస్కోప్ సర్జన్ డా. కె.శ్రీధర్,సూపరింటెండెంట్, డా. స్వాతి, డా. భవాని కలిసి ఆ మహిళకు లాప్రోస్కోప్ సర్జరీ విజయవంతంగా చేశారని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని, ఆసుపత్రి సిబ్బందిని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## పన్నుల వసూలు ప్రక్రియ
# త్వరితగతిన పూర్తి చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్
ఫైజాన్ అహ్మద్..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:**పన్నుల వసూలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.మున్సిపల్ అధికారులతో పన్నుల వసూలు,ఎల్ఆర్ఎస్,వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ,వేసవి క్యాంపుల నిర్వహణ,తదితర అంశాలపై ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని మున్సిపాలిటీలలో అన్ని రకాల పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ఇప్పటివరకు పూర్తి చేసిన పన్నుల వసూలు,రావాల్సిన బకాయిల వివరాలను మునిసిపాలిటీల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.సమయానికి పన్నులు చెల్లించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియను పర్తి చేయాలన్నారు.విద్యార్థుల కోసం ఏర్పాటు చేయనున్న వేసవి శిబిరాన్ని పకడ్బందీగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.ఈ నెలఖరుతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ముగుస్తుందని,ఆమోదం పొందిన దరఖాస్తుదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్,జాదవ్ కృష్ణ,రాజేష్ కుమార్,అధికారులు,సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.



## విచారణ సర్వే తర్వాతే
# రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు

ధరణి చట్టంలో సాదాబైనామా ధరఖాస్తులను పరిష్కరించలేదని, భూభారతి చట్టంలో మాత్రం పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా ధరఖాస్తులను పరిష్కరించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

వివరాలు
మెయిన్‌లో

## భూ భారతి చట్టం రైతులకు వరం..



**ప్రజాపక్షం/నేరడిగొండ :**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమం శనివారం నేరడిగొండ మండలంలో తహసిల్దార్,ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పాలన అధికారి రాజర్షి షా,హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంబంధించిన శాశ్వత పరిష్కారానిపై భూభారతి చట్టంలో 24 సవరణలతో రైతులకు శాశ్వత పరిష్కారము చూపడానికి భూమికి సంబంధించిన ఆన్లైన్ ఆఫ్లైన్ ఆర్ ఓ ఆర్ చట్టం ఇంకా అనేక భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కారం లక్ష్యంగా ఈ చట్టం పనిచేస్తుందని అన్నారు. ప్రతి ఒక్క రైతు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏమైనా సమస్యలుంటే దరఖాస్తులు పెట్టుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్,రెవెన్యూ సిబ్బంది,రైతులు,ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం పరిశీలన..

బైంసాఎఎసి చైర్మన్ ఆనంద్ రావు పటేల్..



**ప్రజాపక్షం/కుంటాల:**కుంటాల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బైంసా ఎఎంసి చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ శనివా రం పరిశీలించారు.కొనుగోలు కేంద్రాలకు ధాన్యా న్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు క లగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాల ని సొసైటీ సిబ్బందికి ఆదేశించారు.రైతులు తేమ శాతంను పాటిస్తూ కొనుగోలు నిర్వాహకులకు స హకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఇఒ ,కొత్తపల్లి బుచ్చన్న,హైమద్ పాషావెంకటేష్, రమేష్,మహేందర్,దిగంబర్ తదితరులు ఉన్నారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



**ప్రజాపక్షం/కౌటాల :**కౌటాల మండల కేంద్రంలో శనివారం అడవిలో నుంచి బయటకు వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలైన దుప్పిని గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు దుప్పికి వైద్యం అందించినప్పటికీ ప్రాణాలు కాపాడలేక పోయారు. తీవ్ర గాయాల కారణంగా దుప్పి మృతి చెందింది. అయితే మృతదేహాన్ని అధికారులు ఖననం చేశారా లేదా అనే విషయమై స్పష్త లేదు.

# ఉద్యమకారుల సంక్షేమ బోర్డుపై కెసిఆర్ వైఖరి ఏంటి?

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ జవ్వాజి శంకర్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :**బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు గురించి కెసిఆర్ స్పష్టమైన వైఖరి తెలియజేయాలనీ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్ డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని టఫ్ కార్యాలయంలో శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జవ్వాజి శంకర్ మాట్లాతెలంగాణ రాష్ట్రం కోసం సబండ వర్గాలు రాష్ట్రం కొరకు ఉద్యమంలో తమ విలువైన సమయాన్ని, కుటుంబాలను వదిలిపెట్టి తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా కొట్లాడే సందర్భంలో అనేక కేసులు, నిర్బంధాలు ఎదుర్కొన్నామని తెలిపారు. తద్వారా తెలంగాణ ఉద్యమకారుల ఆర్థిక స్థితిగతులపై సామాజిక జీవితాలపై ప్రభావం పడిందని,గత ఏడు సంవత్సరాలుగా రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డుకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నామని శంకర్ వివరించారు.ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల అంశం పొందుపరచాలని కోరామని, కానీ టిఆర్ఎస్ పార్టీ ఇప్పటివరకు తమ యొక్క వైఖరి తెలుపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.నేడు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే సభలో తెలంగాణ ఉద్యమకారుల అంశాన్ని గమనించి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డుపై కెసిఆర్ వైఖరి ప్రకటించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా పక్షానశంకర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు తన్వీర్ సత్యం రావు,వైస్ చైర్మన్ రాగుల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి భారతపు లింగారెడ్డి, అధికార ప్రతినిధి నచుపల్లి రెడ్డి ,నియోజకవర్గ కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే:జగిత్యాల ఆర్‌డిఒ

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** వయోవృద్ధులైన కన్న తల్లి,దండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదే నని విస్మరిస్తే శిక్షార్హులేనని ,జైలు శిక్ష ,జరిమానా తదితర చట్ట పరమైన చర్యలు తప్పవని జగిత్యాల డివిజన్ ఆర్‌డిఒ ,వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ పి.మధుసూదన్ హెచ్చరించారు.శనివారంఆర్‌డిఒఛాంబర్లో వయోవృద్ధుల పోషణ,సంరక్షణ చట్టం కింద దాఖలు అయిన కేసుల్లో కొడుకులు,కోడళ్ళను ,కూతుర్లను ఆర్‌డిఒముందు విచారణకు హాజరయ్యారు.విచారణల్లో పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నల్లరాజిరెడ్డి, గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన ఈర్తి రాయమల్లు, ,జగిత్యాల పట్టణం లో వాణి నగర్ కు పల్లికొండ లక్ష్మి , గొల్లపల్లి మండలం మల్లన్నపేట్ గ్రామానికి చెందిన గుండేటి రాజేశ్వరి ల ఫిర్యాదులపైఆర్‌డిఒ విచారణలు జరిపారు.తమ కుమారులనుంచి పోషణ,వైద్య ఖర్చులు,ఆస్తులు తిరిగి ఇప్పించాలనే కేసుల్లో ఆవృద్ధుల తరుపున సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తన వాదనలుఆర్‌డిఒకు వినిపించారు. కొడుకులు,కోడళ్ళకు ఆర్డీవో కౌన్సెలింగ్ చేశారు.అనంతరం ఆర్‌డిఒఫిర్యాదుదారులు, కొడుకులు,కోడళ్ల,కూతుర్ల వాంగ్మూలంను విని సాక్ష్యాధారాలు పరిశీలించారు.అనంతరం సంరక్షణ చట్టం 2007 సెక్షన్ 24 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తు వేధింపులకు గురిచేస్తున్న వారికి,నోటీసులు ఇచ్చినా హాజరు కాని వారికి ,తీర్పులు పాటించని వారికి 6 నెలల వరకు జైలు శిక్షతో పాటు జరిమాన విధించే వీలుందని కొడుకుల ను, కోడళ్లను ,కూతుర్లను హెచ్చరిస్తూ తల్లిదండ్రుల పోషణకు,సంరక్షణకుఆర్‌డిఒఆదేశించారు.విచారణలో ఆర్‌డిఒ కార్యాలయంఎఒతఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటిజేన్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,కౌన్సెలింగ్ ప్రతినిధులు గౌరిశెట్టివిశ్వనాథం, నక్క ఇంద్రయ్య, చట్టంసెక్షన్ అసిస్టెంట్ ,ఎఫ్ఆర్ఓ,తదితరులున్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన కార్యదర్శులపై చర్యలు

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**ఇల్లందకుంట మండలం లోని శ్రీరాములపల్లి గ్రామపంచాయతీలో గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి కార్మికుని పేరును ఆన్లైన్‌లో నమోదు చేయకుండా తాత్కాలికంగా నియమించుకున్న కార్మికుడి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వెనుక అనుమానాలున్నాయని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ఆరోపించారు. ఈ విషయమైన అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికుడి పేరును నమోదు చేయకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొన్నారు. సదరు కార్మికుడికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం ఇల్లందకుంట ఎంపిడివో కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే విచారణ చేసి కార్మికునికి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొత్తూరు మల్లయ్య, కార్మికుడు పర్లపెల్లి మల్లేషు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఆగిన బ్రిడ్జి నిర్మాణం పనులు

*ఓడేడ్ బ్రిడ్జి ని పూర్తి చేయండి* రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి* పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించి దూరాన్ని తగ్గించాలని డిమాండ్* సిపిఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా మంథని నియోజక వర్గ పరిధిలోని ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ శివారులో మానేరు నది పై గత ప్రభుత్వ పాలన లో ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకుండానే కూలిపోయిందని,దానిని వెంటనే పూర్తి చేసి పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించి దూరాన్ని తగ్గించాలని సిపిఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఓడేడ్ గ్రామ శివారులో కూలిపోయిన బ్రిడ్జి ని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం లో లోపాలు ఉన్న మూలంగా నిర్మాణం పూర్తి కాకుండానే పిల్లర్ లు కూలిపోయాయని ఆయన ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణం లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం, ప్రభుత్వ అధికారుల అజమాయిషీ లేక పోవడం మూలంగా బ్రిడ్జి పిల్లర్లు గాలి దుమారానికి కూలీ పోయాయని ఆయన ఆరోపించారు. బ్రిడ్జి పిల్లర్లు కూలి రెండు సంవత్సరాలు గడిచినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాక పోవడం వల్ల బ్రిడ్జి పక్క నుంచి తాత్కాలికంగా మట్టి రోడ్డు మీద వాహనాల ద్వారా సమీప ప్రాంతంలో ఉన్న ప్రజలు మరియు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు కూడా చాలా మంది ఈ బ్రిడ్జి ప్రక్క నుంచి ప్రయాణం చేస్తున్నప్పటికీ ని వర్షాకాలంలో ఇబ్బందులకు గురి అవుతారని ఆయన పేర్కొన్నారు. కనుక ఇప్పటికైనా ప్రభుత్వం, మంత్రి శ్రీధర్ బాబు దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి ఐతే దాదాపు ముప్పై కిలోమీటర్ల దూరం రెండు జిల్లాల ప్రజలకు తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

## బసవేశ్వర జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు

కమిటీ సభ్యులుగా గుంటి జగదీశ్వర్

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** మహాత్మ బసవేశ్వర జయంతిని ఈనెల 30 న అధికారికంగా జరుపాలని భావించి రాష్ట్ర ప్రభుత్వం 22 మందితో ఒక ఉత్సవ కమిటీని నియమించింది.హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో, రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బసవ జయంతిని నిర్వహించేందుకు గాను ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని అందులో భాగంగానే ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఉత్సవ కమిటీ చైర్మన్ గా జాహిరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ తో పాటు జగిత్యాల కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ న్యాయవాది గుంటి జగదీశ్వర్ తోపాటు 22 మందితో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.జగదీశ్వర్ నియామకం పట్ల జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.కమిటీ సభ్యులుగా నియామకం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జాహిరాబాద్ ఎంపీ, కమిటీ చైర్మన్ సురేష్ శెట్కార్ కు జగదీశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్సీ రమణ పరామర్శ

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల మున్సిపల్ పరిధిలోని టి.ఆర్ నగర్ 47వ వార్డు చెందిన బిఆర్ఎస్ యూత్ కార్యదర్శి కోటగిరి సుమన్ తల్లి ని కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ శనివారం పరామర్శించారు.సుమన్ తల్లికి ఇటీవల కంటి ఆపరేషన్ జరగగా నివాసంలో వారిని కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని రమణ పరామర్శించారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ వెంట మైల రాజు, వెంకటేష్, రజియా, నజీమా తదితరులున్నారు.

## చేరాల సుధాకర్‌కు డాక్టరేట్ ప్రదానం

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**ఇల్లందకుంట మండలంలోని మల్లన్నపల్లె గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన చేరాల సుధాకర్‌కు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. 'తెలుగులో గేయ కవిత్వం (1970 2000) సామాజిక ఉద్యమాలపై ప్రభావం ' అనే అంశంపై గైడ్ డా.కంచి విజయలక్ష్మి పర్యవేక్షణలో పాటపై ఇష్టంతో పాట అనేక ఉద్యమాలలో ఏ విధంగా ప్రజలను ప్రభావితం చేసిందో సిద్ధాంత గ్రంథంలో తెలియజేశారు. పల్లె నుండి డాక్టరేట్ పట్టా ప్రదానం వరకు చేసిన కృషికి మిత్రులు, గురువులు ఆనందం వ్యక్తం చేశారు. సుధాకర్ ప్రభుత్వ కళాశాల రంగశాయిపేటలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. చేరాల మల్లయ్య కుటుంబం నుంచి ఐదుగురు ఉద్యోగాల్లో స్థిరపడ్డందుకు గ్రామ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులకు మద్దతు ధర కల్పించేందుకే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఐకెపి ఎపిఎం పద్మ అన్నారు.శనివారం ముత్తారం మండలంలోని ఇప్పలపల్లి (రామకృష్ణాపూర్) గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎపిఎం దొమ్మటి పద్మ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వరి ధాన్యం ఒక క్వింటాలుకు ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బి గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2300 మద్దతు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుగుణ శ్రీనివాస్, మల్లయ్య, ఉప్పు శ్రీనివాస్, సిసి రాధిక తో పాటు మహిళలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ రమణ పరామర్శ

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల మున్సిపల్ పరిధిలోని టి.ఆర్ నగర్ 47వ వార్డు చెందిన బిఆర్ఎస్ యూత్ కార్యదర్శి కోటగిరి సుమన్ తల్లి ని కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ శనివారం పరామర్శించారు.సుమన్ తల్లికి ఇటీవల కంటి ఆపరేషన్ జరగగా నివాసంలో వారిని కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని రమణ పరామర్శించారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ వెంట మైల రాజు, వెంకటేష్, రజియా, నజీమా తదితరులున్నారు.

# గులాబీ రజతోత్సవాలకు..

**ప్రజాపక్షం/గోదావరిఖని :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో సింగరేణి కార్మికులదే ప్రధాన భూమిక అని వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలకు రామగుండం నియోజకవర్గంలోని సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున కదలి రావాలని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. శనివారం గోదావరిఖని ఆర్జీ1 పరిధిలోని 11ఎ గని వద్ద కార్మికులతో ఆయన మాట్లాడారు. టిబిజికెఎస్ నాయకులుమాదాసు రామ్మూర్తి, నూనె కొముురయ్య, వడ్డెపల్లి శంకర్, పర్లపల్లి రవి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి, గోపు అయిలయ్యయాదవ్, నారాయణదాసు మారుతి, జోసెఫ్,ఆవునూరివెంకటేష్,రామరాజుఉన్నారు.

# బిఆర్ఎస్ ఉత్సవాలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/పాలకుర్తి :** వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సావాలకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు స్థానిక పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేపడ్తున్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మండల నాయకులు ముల్కల కొమురయ్య ఆధ్వర్యంలో రజతోత్సవాల గోడపత్రికలను శనివారం ఆవిష్కరించారు. మండలంలోని ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్‌లో మాజీ ఎమ్పీటీసీ బండారి స్రవంతి కిరణ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ జెండా గద్దెను నిర్మించారు.

# కెసిఆర్ కటౌట్‌కు దిష్టితీశారు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** బిఆర్ఎస్ రజతోత్సవ సభ దిగ్విజయం కావాలని ఆకాంక్షిస్తూ కరీంనగర్‌లో పట్టణంలోని కోతిరాంపూర్ చౌరస్తాలో 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోబిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కటౌట్‌కు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గుమ్మడికాయలతో దిష్టితీశారు. గంగుల మాట్లాడుతూ కెసిఆర్ టిఆర్ఎస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి కాంగ్రెస్, బిజెపి లాంటి దుష్ట శక్తులు ఎంత ప్రభావం చేసినా భగవంతుడు ఆయన వెంటే ఉన్నారని, అందుకే ఏ కార్యక్రమం నిర్వహించినా దిగ్విజయంగా పూర్తవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు భారతదేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. కెసిఆర్ స్థాపించిన బిఆర్ఎస్ పతనం కావాలని కొంత మంది దిష్టి పెడుతున్నారని, అందుకే కరీంనగర్ ఆడబిడ్డలతో కలిసి కెసిఆర్ దిష్టితగలకుండా ప్రార్థించామన్నారు. బిఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని తెలిపారు. లక్షలాదిగా సభకు తరలి వచ్చి విజయవంతం చేసేందుకు పార్టీ క్యాడర్‌తో పాటు అభిమానులు, ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కలర్ సత్తెన్న తదితరులున్నారు.

# ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీలు, నిరసనలు





**ప్రజాపక్షం/చొప్పదండి:** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ కాంగ్రెస్ ఆద్వర్యంలో చొప్పదండి పట్టణంలో బంద్ పాటిస్తూ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించి పట్టణ వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, ముద్దం తిరుపతి గౌడ్, ముద్దసాని రంగన్న, గుర్రం రాజేందర్‌రెడ్డి, గుర్రం రమేష్ గౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, కడారి శంకర్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, , నెరుమట్ల మల్లేశం, మావురపు రాములు, ఈర్ల స్వామి, పత్తిపాక నరేష్, చిలుక సంజీవ్, చుప్ప శ్రీనివాస్, పెద్ది రాజేందర్, చిలుముల స్వప్న, గుంటి స్వరూప, గర్శకుర్తి సునీత, గడమల్ల గంగారం, దొంగరి రమేష్, గన్ను సంతోష్ రెడ్డి, నల్లాల అఖిల్, కూకట్ల రాజేష్, కొత్తూరు అజయ్, మరం శ్రీనివాస్, పాలూరి ప్రసాద్, పెద్ది శ్రీనివాస్, పిట్టల వెంకటేష్, జహంగీర్, రజాక్, చీకట్ల గంగరాజు, అజయ్ బాబు, గంగరాజు, రాజేష్, నూనె చందు, రాజశేఖర్, శ్రీనివాస్, రాజేందర్, మచ్చ రమేష్, సంతోష్ తదితరులున్నారు.

### చొప్పదండి బంద్ ప్రశాంతం

కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆద్వర్యంలో శనివారం చేపట్టిన చొప్పదండి బంద్ ప్రశాంతమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోటల్స్, వాణిజ్య వ్యాపార సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు, యువజన సంఘాల సంఘీభావంతో స్వచ్చందంగా బంద్ నిర్వహించారు. అనంతరం చొప్పదండి పట్టణ పురవీధుల గుండా జై శ్రీరామ్ అంటూ నినదిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్బంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస సుదర్శన్ మాట్లాడుతూ హిందువులపై దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే దేశ విచ్చిన్నకర శక్తుల నుంచి కాపాడుకునేందుకు అందరూ సంఘటితమై దేశం నుంచి తరిమి కొట్టేందుకు కంకణబద్దులై ఉండాలన్నారు.



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ చొప్పదండి బాలుర మైదానంలో వాకర్స్ క్లబ్ ఆద్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం హిందూ సంఘాల ఐక్యవేదిక చొప్పదండి పట్టణ బంద్‌కు ఇచ్చిన పిలుపు మేరకు సంపూర్ణ మద్దతు ప్రకటిచారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు దండె లింగన్న, దూస రాము, మేడి వేణు, చీకట్ల కుమార్, అంజన్న, మహేశుని మల్లేశం, పోతు రాజు తదితరులున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే మాబ్ ఆపరేషన్ డ్రిల్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో గోదావరిఖని ఎసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులకు మాబ్ అపరేషన్ మాక్ డ్రిల్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శాంతిభద్రతలను పరిరక్షించడమే ఈ డ్రిల్ ముఖ్య లక్ష్యమని పెద్దపల్లి డీసీసీ



కరుణాకర్ తెలిపారు. ప్రజల ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసాలకు పాల్పడుతున్న సమయంలో, అక్రమంగా గుమిగూడిన జన సమూహాలను ఏవిధంగా కంట్రోల్ చేయాలని, వారిని ఏవిధంగా చెదరగొట్టాలని, అవాంఛనీయ సంఘటనలు దృష్టికి వచ్చినపుడు, శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏవిధంగా స్పందించాలి, ఏలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై ఆర్ఎస్ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ రఫీ అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. గోదావరిఖని ఒకటో పట్టణ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్ఐలు రమేష్, భూమేష్, ఉదయ్‌కిరణ్, మానస, సంధ్యారాణి పాల్గొన్నారు.

# మా భూ సమస్యను పరిష్కరించండి

### ఎమ్మెల్యే, తహసీల్దార్‌లకు వినతి పత్రం ఇచ్చిన మడిపల్లి బాధితులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కాల్వ శ్రీరాంపూర్ మండలం మడిపల్లి లోని తమ భూ సమస్యను పరిష్కరించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు, తహసీల్దార్‌లకు మడిపల్లి బాధితులు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో భూ భారతి అవగాహన సదస్సు జరిగింది. మడిపెల్లి గ్రామ భూ బాధితులు తొడుపునూరి రాజయ్య, తొడుపునూరి రత్నమ్మవారసులు రమేశ్‌కుమార్, క్రిష్ణమూర్తి వినతి పత్రాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ మడిపెల్లి గ్రామ శివారులో తొడుపునూరి రాజయ్యకు 036 గుంటలు, రత్నమ్మకు 036 గుంటలు గల భూమిని మిస్బాయొద్దిన్ అక్రమంగా ఆర్.ఓ.ఆర్ చేసుకుని ఇతరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. అదేవిధంగా తొడుపునూరి రాజయ్యకు 08 1/2 గుంటలు, రత్నమ్మకు 08 1/2 గుంటలు అదే గ్రామానికి చెందిన శంకర్ అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, పట్టాలను రద్దు చేసి తిరిగి తమ పేర్లను నమోదు చేయాలని 2012 నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని, పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరామని వివరించారు.

# రజతోత్సవ సభకు తరలిరండి



**ప్రజాపక్షం/ముత్తారం :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నేడు ఆదివారం నిర్వహించతలపెట్టి బీఅర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు వేలాదిగ తరలిరావాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కోరారు. ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో కార్యకర్తలతో శుక్రవారం రాత్రి కలిసి చలో వరంగల్ సభ అంశంపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఅర్ పాలన లో అన్నివర్గాలకు సముచిత న్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం పేద బడుగు వర్గాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఅర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ ద్వారా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంథని నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకురావడం జరిగిందన్నారు.ముత్తారం మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు వరంగల్ సభకు తరలివెళ్లేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని బీఅర్ఎస్ రజతోత్సవం సభ పట్ల ప్రజలకు ఆవగాహన కల్పించి వారిని ఎక్కువ సంఖ్యలో సభకు తీసుకోచ్చేల కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

# పోలీసు ఉత్తమ సేవలకు అత్యున్నత పురస్కారం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** విధి నిర్వహణలో ఉత్తమ సేవలకుగాను అత్యుత్తమ పురస్కారాలను రామగుండం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ యు.ఉపేందర్, కానిస్టేబుల్ సంపత్‌లు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో డిజిపి జితేందర్ వీరికి నగదు రివార్డుతోపాటు పురస్కారాలను అందజేశారు. ఎస్ఐ ఉపేందర్, కానిస్టేబుల్ సంపత్‌లు గంజాయి కేసులో నిందితుడు ఎస్ఆర్ఎస్పి కెనాల్‌లో దూకి పారిపోతుండగా ప్రాణాలకు తెగించి కెనాల్‌లో దూకి నిందితుడిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని డిజిపి జితేందర్‌తోపాటు నార్కొటిక్స్ ఎడీజీ సందీప్ శాండిల్య, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూలు ప్రత్యేకంగా అభినందించారు.

# అభివృద్ధి పథంలో తెలంగాణ



**ప్రజాపక్షం/గోదావరిఖని :** తెలంగాణ రాష్ట్రం సాంకేతికత, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాల్లో విస్తృత పురోగతిని సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్2025 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన పెట్టుబడులు, పరిశ్రమల ద్వారా రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్న భూభారతి చట్టం

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే




**ప్రజాపక్షం/తిర్యాణి :**ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం 2025 ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే స్పష్టం చేశారు. తిర్యాణి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సులో ఎంఎల్సి దండే విఠల్, ఆర్డిఒ లోకేశ్వర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన చట్టంలో అప్పీలు వ్యవస్థ రైతులకు న్యాయం చేకూరుస్తుందని తెలిపారు. తహశీల్దార్ నుండి సిసిఎల్ఏ స్థాయి వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. రీ సర్వే, కొనుగోలు, పంపకాలు, దానపత్రాలు, వారసత్వ పట్టాల మార్పిడికి కమతం తప్పనిసరి కావడంతో భవిష్యత్తులో భూ వివాదాలు ఉండవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 2 తర్వాత ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ వెల్లడించారు. గతంలో ఉన్న విఆర్ఓ వ్యవస్థ లేకపోవడం వల్ల పెరిగిన భూ సమస్యలను గ్రామ పాలన అధికారులు, లైసెన్స్ సర్వేయర్ల నియామకంతో తగ్గించవచ్చని ఆయన అన్నారు. ఎంఎల్సి దండే విఠల్ మాట్లాడుతూ ధరణి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ, అటవీ భూముల సమస్యలతో పాటు సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూముల సమస్యలు కూడా పరిష్కారమవుతాయని తెలిపారు. పార్ట్ బి లోని వేల ఎకరాల భూములకు పాస్ పుస్తకాలు జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆర్డిఒ లోకేశ్వర్ రావు మాట్లాడుతూ 1/70 చట్టానికి లోబడి రూపొందించిన భూభారతి రైతులకు ఎంతో మేలు చేస్తుందని, పట్టా మార్పిడికి మండల సర్వేయర్ల నక్షజత చేయడం వల్ల భవిష్యత్తులో వివాదాలు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమాదేవి, తహశీల్దార్ సూర్య ప్రకాష్, సహకార సంఘం అధ్యక్షులు చుంచు శ్రీనివాస్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

ఎస్ఇ రాథోడ్ శేషారావు

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**ఆసిఫాబాద్ సర్కిల్లోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడానికి కృషి చేస్తున్నట్లు ఆ శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాథోడ్ శేషారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు నిరంతరాయంగా ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తక్షణ విద్యుత్ సమస్యల పరిష్కారానికి వాట్సాప్ చాట్ బాట్ ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ఏదైనా విద్యుత్ సమస్యలు వస్తే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి వెంటనే సేవలు పొందవచ్చని ఆయన సూచించారు. వినియోగదారులు వారి మొబైల్ నుండి వాట్సాప్లో 7901628348 నంబర్కు హాయ్ అని సందేశం పంపగానే హాయ్ టిజి ఎన్పిడిసిఎల్ కాల్ సెంటర్కు స్వాగతం అనే ప్రత్యుత్తరం వస్తుందని ఆయన వివరించారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అనే ఆప్షన్లు కనిపిస్తాయని తెలిపారు. రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, విత్అవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెను వస్తాయన్నారు. విత్ యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేస్తే వినియోగదారుని విద్యుత్ సర్వీస్ వివరాలు వస్తాయని ఆ వివరాలు సరైనవే అయితే నిర్ధారించగానే ఫిర్యాదుకు సంబంధించిన వివిధ రకాల మెనూ కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదుకు సంబంధించిన సబ్ టైప్, చాట్ విత్ ఏజెంట్ అనే ఆప్షన్లు వస్తాయని ఏజెంట్తో నేరుగా మాట్లాడటంతోపాటు ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

## మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఆదరణ కల్పించాలి

**ప్రజాపక్షం / జైపూర్ :**ప్లాంట్లో డ్రైవర్గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానుగంటి శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్టిపిపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిరంజీవులను ఐఎన్టియుసి కాంట్రాక్ట్ యూనియన్ అధ్యక్షుడు పేరం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు కోరారు. శనివారం రోజున జైపూర్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ను మర్యాదపూర్వకంగా కలుసుకుని, ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి రావలసిన ఇన్సూరెన్స్ మొత్తం 30 లక్షల రూపాయలను హెచ్డిఎఫ్సి బ్యాంకు ద్వారా త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే కుటుంబ సభ్యులకు పవర్ ప్లాంట్లో అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎండ తీవ్రత 45 డిగ్రీల పైగా నమోదవుతున్న నేపథ్యంలో ప్లాంట్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే పని పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరారు. ఇతర కార్మిక సమస్యలను కూడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ తొగరి కృష్ణ, ఉపాధ్యక్షులు మల్లేష్, రమేష్, జాయింట్ సెక్రటరీ శ్రావణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రాజిరెడ్డి, మనోజ్, నరేష్, తిరుపతిరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోం..

బిజెపి ఆధ్వర్యంలో బైంసా ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన..



**ప్రజాపక్షం/బైంసా :**ప్రజాస్వామ్య విరుద్ధంగా ఇందిరమ్మ కమిటీలు వేసి ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బైంసా మండల బిజెపి అధ్యక్షులు సిరం సుష్మ రెడ్డి,మాజీ సర్పంచ్లు అప్పాల రాకేష్,సచిన్,నాయకులు యోగేష్ అన్నారు.శనివారం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక,జరుగుతున్న అవకతవకలపై బిజెపి మండల అధ్యక్షురాలు ఆధ్వర్యంలో బైంసా ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన చేపట్టి మాట్లాడారు.గ్రామ సభలు నిర్వహించి,అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామపంచాయతీ కార్యదర్శులు,ఎవరికి తెలియకుండా అర్హుల జాబితా తయారు చేయడం ఏంటని మండిపడ్డారు.తక్షణమే గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు అర్హుల జాబితా లిస్టును ఉంచాలన్నారు.ఇందిరమ్మ కమిటీల్లో కేవలం కాంగ్రెస్ వారికి ఇవ్వడం అంటే రాజ్యాంగ విరుద్ధమని,అవి ప్రభుత్వ కమిటీలా,లేదా కాంగ్రెస్ కమిటీలా అని మండిపడ్డారు.ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా, కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తుందన్నారు.పేదలకు అన్యాయం జరిగితే ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నేతృత్వంలో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ,మాజీ వైస్ ఎంపిపి,పెండ్ పెల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయకులు ,కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## భూభారతితో భూముల సమస్యలన్నీ పరిష్కారం..



**ప్రజాపక్షం/కుంటాల :**భూములపై ఉన్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రక్షణగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని బైంసా ఎఎంసి చైర్మన్ ఆనంద్ రావు పటేల్ అన్నారు.శనివారం కుంటాల మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలలో 2025 భూభారతి పట్టం పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ ఆనంద్ రావు పటేల్ పాల్గొని మాట్లాడుతూ. .ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరిచిన భూభారతి చట్టం ప్రజలకు ఎంతగానో మేలు కలుగుతుందన్నారు.ప్రజలకు ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులకు సంబంధించి భూముల పై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం పలు కొత్త అంశాలను పొందుపరుస్తూ నూతన ఆర్ ఓ ఆర్ తెచ్చిందన్నారు.భూ భారతి 2025 చట్టంలో చాలా పకడ్బందీగా ఏర్పాటు చేశారని తెలిపారు.ఎక్కువ శాతం భూ సమస్యలు తాసిల్దార్ స్థాయిలోనే పరిష్కారమవుతాయని తెలిపారు.సాదా బైనామా ప్రక్రియ తిరిగి వినియోగంలోకి తీసుకురావడం వల్ల ఎంతోమంది రైతులకు లబ్ధి చేకురుతుందన్నారు.పలువురు రైతులు భూభారతి చట్టంపై సందేహాలను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా నివృత్తి చేశారు.కోర్టులు ఆశ్రయించి సంవత్సరాల తరబడి తిరిగిన వారు భూభారతి ద్వారా సమస్యను పరిష్కారం చేసుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డిపిఒ శ్రీనివాస్,తహసిల్దార్ కమల్ సింగ్, డిప్యూటీ తహసిల్దార్ నరేష్ గౌడ్,ఎంపిడివో లింబాద్రి,వివిధ శాఖల అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉత్పత్తి, పని సామర్థ్యంపై దృష్టి: డైరెక్టర్

**ప్రజాపక్షం/మందమర్రి :**సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, పని సామర్థ్యం పెంపుదలపై దృష్టి సారించాలని డైరెక్టర్ (ప్లానింగ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు జిఎం దేవేందర్ పాల్గొన్నారు. డైరెక్టర్గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మందమర్రి జిఎం కార్యాలయానికి విచ్చేసిన వెంకటేశ్వర్లుకు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మధ్యాహ్నం ఏరియాలోని వ్యూ పాయింట్ నుండి పని ప్రదేశాలను పరిశీలించారు. ఉత్పత్తి స్థాయి, ఉద్యోగుల పనితీరుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేస్తేనే నిర్దేశించిన లక్ష్యాలను సులభంగా చేరుకోగలమని, అలాగే, కెకె ఓసిపిలో నిర్మిస్తున్న పిఒబి ప్లాంటును సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత, మందమర్రి ఏరియాలోని అన్ని గనుల మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సేఫ్టీ మేనేజర్ రఘుకుమార్, ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గ్రూప్ ఏజెంట్ డి. రాంబాబు, ఎస్కెకె గ్రూపు ఏజెంట్ ఎండి అబ్దుల్ ఖదీర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఎన్విరాన్మెంటల్ అధికారి వెంకట్ రెడ్డి, ఎస్టేట్ అధికారిణి శ్రీమతి నవనీత, అన్ని గనుల మేనేజర్లు, సేఫ్టీ అధికారులు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో అనాథ బాలికలకు అవకాశం

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు అనాథ బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్లోని దుర్గాభాయి దేశ్ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణా సంస్థ 202526 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రులు లేని బాలికలు లేదా తండ్రిని కోల్పోయిన నిరుపేద బాలికల నుంచి మూడేళ్ల సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి కోర్సులో ఉన్న 60 సీట్లలో మొత్తం 240 సీట్లకు 70 శాతం అనాథ బాలికలకు లేదా తండ్రి లేని నిరుపేద బాలికలకు కేటాయిస్తారని భాస్కర్ తెలిపారు. వీరు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా కనీసం పదో తరగతి పాసై ఉండాలని సూచించారు. మరో 3 శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తామన్నారు. జిల్లా కేంద్రంలోని జంకాపూర్ బాలరక్షా భవన్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని, సంబంధిత పత్రాలతో నింపి మే 15వ తేదీలోపు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాల కోసం డిసిపిఒను 9491460658 నెంబర్లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పిస్తామని ఆయన వెల్లడించారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :**పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించబడుతుంది. బెల్లంపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో కామినేని కింగ్ కోటి ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఎక్స్రే, ఇసిజి, ల్యాబ్ పరీక్షలు ఉచితంగా చేయబడతాయి. 31వ వార్డు ప్రజలు ఏమైనకలు సంబంధించిన సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు లెంకల శ్రీనివాస్, బుకాల రంజిత్ కుమార్, లెంకల్ సన్నీ యాదవ్, పీక లక్ష్మణ్ వార్డు ప్రజలు కరపత్రాలు పంచి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మహిళ సంఘాల అభివృద్ధికి బాటలు

ఎంఎల్ఎ సంజయ్కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తువారి అభివృద్ధికి బాటలు వేయడం ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాలశాసనసభ్యులు డా.సంజయ్కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళ సంఘాలకు ఆర్టిసి బస్సులు ఇవ్వడం, సోలార్ ప్లాంట్ ఏర్పాటు వివిధ ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిలా బ్యాంకు లింకేజీ రుణాలు అందివ్వడం జరుగుతుందని అన్నారు. మండల ఎపియం వి.గంగాధర్, సిసిలు, పి విద్యాసాగర్, జి.శ్రీనివాస్, రూరల్ అర్బన్ మండలాల సమాఖ్య అధ్యక్షురాల్లు , అన్ని గ్రామాల గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు వివోఏలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మోహన్‌రావ్ పటేల్ పరామర్శ



**ప్రజాపక్షం/లోకేశ్వరం:**లోకేశ్వరం మండలం రాయ్ పూర్ కాండ్లి గ్రామానికి చెందిన ఈర్ల రాజేందర్ ఇటీవలరమపదించడం జరిగింది.ఈరోజు మోహన్‌రావ్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావ్ పటేల్,ఈ రోజు కాండ్లి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/లోకేశ్వరం;**పుస్పూర్ గ్రామానికి చెందిన హన్మగౌడ్ అనే లబ్ధిదారునికి సుమారు60వేల రూపాయల సిఎం సహాయ నిధి చెక్కును అందించడం జరిగింది. మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,నిర్మల్ జిల్లా ఇచ్చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు భాధిత కుటుంబాలు తెలియజేశారు.కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్‌టి సేల్ అధ్యక్షుడు సంఘం సరసయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక...



**ప్రజాపక్షం/కుంటాల :**కుంటాల మండల ఐకెపి సరస్వతి మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బత్తుల కరుణ,కార్యదర్శిగా మలేగాం సురేఖ,కోశాధికారిగా సిందె కవిత,ఉపాధ్యక్షురాలిగా సురేఖ,సహాయ కార్యదర్శిగా రాధిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని మహిళ సంఘాలు,ఐకెపి సిబ్బంది అభినందించా రు .ఘనంగాసన్మానించారు.కార్యక్రమంలో ఇంచార్జ్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాస్,డిపిఎం సాయి ప్రసాద్,ఎపిఎం అశోక్,సిసి పెంటన్న యూసఫ్,కవిత అకౌంటెంట్ శివప్రసాద్ స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ స్వాతి,నవీన్,గ్రామ సంఘాలమహిళాలుఇసిసభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై కొత్త ఫీచర్ వాట్సాప్ చాట్ బాట్..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**విద్యుత్ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తిన 1912 టోల్ ఫ్రీ నంబర్ తో పాటుగా కొత్త ఫీచర్ ''వాట్సాప్ చాట్ బాట్''ను అందు బాటులోకి తీసుకువచ్చామని నిర్మల్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బి.సుదర్శన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా వినియోగదారులు తమ మొబైల్ నుండి వాట్సాప్ లో 7901628348 నంబర్ కు హాయ్ అని చాట్ చేయగానే హాయ్ టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్ కాల్ సెంటర్ కు స్వాగతం అని వచ్చి అందులో రిజిస్టర్ కంప్లైంట్,ట్రాక్ కంప్లైంట్,చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది.అందులో రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్,విత్అవుట్ యూనిక్ సర్వీస్ నంబర్,ప్రీవియస్ మెను వస్తుంది.ఇలా విత్ యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేయగానే వినియోగదారుని విద్యుత్ సర్వీస్ వివరాలు వస్తాయి.ఇలా వివరాలను ఓకే చేయగానే కంప్లైంట్ కు సంబంధించిన వివిధ రకాలు సవివరంగా మెనూ లో కనపడుతాయి.అందులో కంప్లైంట్ కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ వస్తుంది.ఇలా ఏజెంట్ తో చాట్ చేయవచ్చు లేదా కంప్లైంట్ నమోదు చేసుకోవచ్చని చెప్పారు.కంప్లైంట్ ఐడి తో ఒక నంబర్ జెనెరేట్ అయ్యి మీ ఫిర్యాదు నమోదు చేయబడుతుంది.తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారికి నివేదించబడిందని వినియోగదారునికి సమాచారం రూపకంగా మెసేజ్ వెళ్తుందని తెలిపారు.అలా భవిషత్తులో కంప్లైంట్ ఐడి తో వినియోగదారుని సమస్యను ట్రాక్ చేసుకోవచ్చని చెప్పారు.కంప్లైంట పూర్తి అయ్యిన పిదప వినియోగదారునికి సమాచారంతో పాటు ఐవిఆర్ఎస్ ద్వారా కాల్ వెళ్తుంది.అలాగే (www .tgnpdcl .com) వెబ్ సైట్ లో వాట్సాప్ ఐకాన్ కనిపిస్తుందని ఆ ఐకాన్ క్లిక్ చేసుకొని చాట్ చేయవచ్చని చెప్పారు.వినియోగదారునికి ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని సత్వర విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి వాట్సాప్ చాట్ బాట్ ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు.అలాగే టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందగలరని కోరారు.

# వడదెబ్బ నివారణపై అవగాహన



**ప్రజాపక్షం/మందమర్రి :**వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికులు, ప్రజలు తగిన జాగ్రత్తలు వహించాలని, ఎండలో బ యటకు వెళ్ళే సమయంలో వడదెబ్బ తాకకుండా తగు చ ర్యలు తీసుకోవాలని సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోకనా థ్ రెడ్డి అన్నారు. మందమర్రి ఏరియాలోని కెకె 5 గని ఉ ద్యోగులకు వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం కెకె 5 గని మేనేజర్ శంభునాథ్ పా ండే ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ ంలో సింగరేణి వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్ రెడ్డి ముఖ్య అ తిథిగా పాల్గొని కార్మికులకు వడదెబ్బ నివారణపై పలు సూ చనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకనాథ్ రెడ్డి మా ట్లాడుతూ ఉద్యోగులు ఎండలో ఎక్కువ సేపు తిరగకూడద ని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు నీరు ఎ క్కువగా తీసుకోవాలని, నిమ్మరసం, పండ్ల రసాలు తాగాల ని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపీ ధరించాలని, లేత రంగు కాటన్ దుస్తులు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమ ంలో గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, ఎఐటియుసి బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, గని సేఫ్టీ ఆఫీసర్ ఎం కార్తీక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం కార్తీక్, మేనేజ్‌మెంట్ ట్రైనీ పర్సనల్ ఎ. రవళి, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ శోభ

### వరంగల్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చిన బాల్క సుమన్



**ప్రజాపక్షం/ మందమర్రి :**తెలంగాణ సాధన కోసం ఏర్పాటైన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయడానికి పెద్ద ఎత్తున తరలి రావాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ పిలుపునిచ్చారు. శనివారం మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్ పాల్గొన్నారు. బైక్ ర్యాలీ మందమర్రి పట్టణంలోని మార్కెట్ వీధుల గుండా మందమర్రి బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ ప్రజల పార్టీ అయిన బిఆర్ఎస్ రజతోత్సవ సభకు అందరూ తరలిరావాలని, తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది బిఆరెస్ అనేది సభ విజయవంతంతో తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు విజిత్ రావు, చెన్నూరు నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, టిఆర్ఎస్ నాయకులు, టిజిబికెఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు, యూత్ విభాగం, విద్యార్థి విభాగం, సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే కేటాయించాలి



**ప్రజాపక్షం /జైపూర్ :**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల ఎంపికలో అర్హులైన పేదలకే ఇళ్లు కేటాయించాలని బిజెపి మండల అధ్యక్షుడు దూట రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని బిజెపి నాయకులతో కలిసి శనివారం మండల అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దూట రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాల ఎంపిక కమిటీలలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉద్యోగస్తులు, కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, కాంగ్రెస్ నాయకులకే ఎక్కువ ఇళ్లు కేటాయించినట్లు తమకు సమాచారం ఉందని ఆరోపించారు. 10 ఏళ్ల తర్వాత ఇందిరమ్మ గృహాలు రావడంతో, పేద మహిళలు, ఒంటరి స్త్రీలు, వికలాంగులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని, వారికి కాకుండా కేవలం కాంగ్రెస్ నాయకులు మాత్రమే ఇళ్లు పొందేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు బడుగు బలహీన వర్గాలకు, ఒంటరి స్త్రీలకు, పేదలకు ఇళ్లు కేటాయించి తమ నిజాయితీని నిరూపించుకోవాలని కోరారు. అర్హులకు ఇళ్లు కేటాయించకపోతే, మండల స్థాయిలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో మండల ఒబిసి అధ్యక్షుడు తిరుపతి గౌడ్, నేతకాని సంఘం మండల అధ్యక్షుడు మొగిలి, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో అన్యువల్ డే




**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని వడ్యాట్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం ఇసిసిఇ డే, అన్యువల్ డే, ఎఎన్‌సి చెకప్, అన్న ప్రసాన కార్యక్రమాలను నిర్వహించారు. గర్భవతులు తప్పకుండా అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చి బరువులు తీయించుకోవాలని చెప్పడం జరిగింది. అలాగే గర్భవతిగా ఉన్న మహిళలు ప్రతిరోజు అంగన్‌వాడి సెంటర్‌లోకి భోజనం చేయాల్సిందిగా వారికి తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ మంజుల, హెల్త్ సూపర్ వైజర్, ఎఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు కవిత, శోభ, ఆశ వర్కర్ మమత, తల్లులు, పిల్లలు బాలింతలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన శిబిరంలో కోడింగ్, సెన్సార్లపై శిక్షణ

**ప్రజాపక్షం/మంచిర్యాల :**జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు కోడింగ్, సెన్సార్లపై శిక్షణ అందించడం జరిగిందని జిల్లా సైన్స్ అధికారి మధుబాబు తెలిపారు. బెల్లంపల్లికి చెందిన కోడింగ్ నిపుణులు సాల్మన్ జోన్స్ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రత్యక్షంగా సెన్సార్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరిచయం చేశారు. కంప్యూటర్ ద్వారా ప్రాజెక్టులకు సంబంధించిన కోడింగ్‌పై ఆయన శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ఎల్ఇడి బ్లింకింగ్, ఐఆర్ సెన్సార్, రైన్ వాటర్ సెన్సార్, సాయిల్ మాయిచర్ సెన్సార్ల కోడింగ్, పనితీరు, వాటి కనెక్షన్ల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , జిజ్ఞాస టీం సభ్యులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సర్‌సిల్క్‌లోని యూనియన్ బ్యాంక్ కోసిని చింతగూడ బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్ మన్వర్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు, సిబ్బందితో పాటు బ్యాంకు మిత్రలు మేనేజర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. బ్యాంకు పరిధిలో ఇటీవల కాలంలో చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న మేనేజర్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఖాతాదారులకు మూడు సంవత్సరాల పాటు సేవలందించానని, ఈ సన్మానం తనకు గౌరవాన్ని పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమ ంలో యూనియన్ బ్యాంక్ కోసిని చింతగూడ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ సూరజ్, సబ్ మేనేజర్ బావండ్లపల్లి రాజశేఖర్, క్యాషియర్ ప్రమోద్, గోల్డ్ అప్రైజర్ మధూకర్,బ్యాంకు సిబ్బంది దేవమ్మ, బ్యాంకు మిత్రలు జగ్గారావు, రాజు, శ్యాంసుందర్, సిబ్బంది అశోక్, ఆయా బ్యాంకుల మేనేజర్‌లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడేపు భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించే ఈ పురస్కారాలకు జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 18 సంవత్సరాల లోపు బాలబాలికలు అర్హులని ఆయన పేర్కొన్నారు. సాంస్కృతిక కళలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల నమోదు ఆన్‌లైన్‌లో మాత్రమే ఉంటుందని, ఎంపికైన వారికి డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ సందర్భంగా పురస్కారాలు అందజేస్తారని ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు http: //awards.gov.in వెబ్‌సైట్‌లో 2025 జూలై 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9491460658 నెంబర్‌ను సంప్రదించగలరని ఆయన పేర్కొన్నారు.

## దాడులకు పాల్పడుతున్నారని సిపికి ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులతో ప్రాణహాని ఉందని, వీరి బారి నుంచి తనకు రక్షణ కల్పించి తనను తన కుటుంబాన్ని కాపాడాలని కోరుతూ ధర్మారం గ్రామానికి చెందిన సుండు సతీష్ అనే వ్యక్తి శనివారం జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్యకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మారం గ్రామానికి చెందిన సుండు యాదగిరి అనే వ్యక్తి నరికి వేశారని, తాను జిల్లా అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశానని దీంతో అటవీ శాఖ అధికారులు చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా విధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తనపై కక్ష గట్టిన సుండు యాదగిరి, అరున్ కుమార్, సుండు నర్సయ్య అనే వ్యక్తులు తనను చంపడానికి యత్నిస్తున్నారని, వీరిపై చర్యలు చేపట్టిన తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఇప్పటి వరక ఉ తనపై, తన ఇంటిపై రెండు సార్లు దాడి చేశారని, ఈ నెల 25న గొడ్డలి, గడ్డపారతో వచ్చి తన ఇంటిపై దాడి చేశారని, తనపై కూడా దాడికి యత్నించగా స్థానికులు అడ్డుకున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన యాదగిరి, అరున్ కుమార్కు సుండు నర్సయ్య సహకరిస్తూ తనను చంపాలని ప్రొత్సహిస్తున్నాడని, చంపితే బెయిల్పై బయటికి తీసుక వస్తానంటూ వారిని రెచ్చగొడుతూ దాడికి ఉసి గొల్పుతున్నాడని సిపి కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుండు నర్సయ్య అనే వ్యక్తి తనపై పలుమార్లు దాడులకు పాల్పడ్డాడని, ఆయనపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. పాత కక్షలను దృష్టిలోపెట్టుకొని సుండు యాదగిరి, అరున్ కుమార్ ను తనపై దాడులకు ఉసిగొల్పుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై తనపై దాడులకు సంబంధించిన వీడియోలను ఎడపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేసిన ఎడపల్లి పోలీసులు చర్యలు చేపట్టడం లేదని అందుకే తాను పోలీస్ కమీషనర్ ను ఆశ్రయించానని సుండు సతీష్ తెలిపారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్ కోఆర్డినేటర్గా గోపాలకృష్ణ నియామకం

**ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన వారి ప్రతిభను గుర్తించి వెలుగులోకి తెస్తూ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్



సెర్చ్ ఫౌండేషన చైర్మన్ చింతపట్ల వెంకటాచారి జిల్లా కోఆర్డినేటర్గా రాఘువాపురం గోపాలకృష్ణను నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలకృష్ణ కంజర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుని గా పని చేస్తున్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ దేశంలో ఇస్తున్న లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్తో సమానమని ఆయన తెలిపారు. జిల్లాలో కూడా ఈ అవార్డుకు అర్హత గలవారిని గుర్తించిఐ కాన్ అవార్డు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

## పంచాయతీ కార్మికులతో 'మేడే' పోస్టర్ల ఆవిష్కరణ




**ప్రజాపక్షం/మోర్తాడ్:** ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకులు జి.జమున, అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.కిషన్లు అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో మే డే పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1886 కంటే ముందు 18గంటల నుంచి 20గంటల పని దినాలు ఉండేవని, పని గంటలు తగ్గించుకోవడం కొరకు దేశ వ్యాప్తంగా ఆనాడు కార్మికులు పోరాటాలు చేయగా ఆ పోరాటంలో ఓ కార్మికుడు రక్తం కారుతున్న రక్తంలో ముంచి ఎగిరేసిన జెండానే ఈ 139వ మేడే ఎర్రజెండా అని అన్నారు. ఆ రోజు కార్మికులు పోరాడి సాధించి పెట్టిన 8గంటల పని దినాన్ని, ఈ రోజు మన దేశ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ 8గంటల పని దినాన్ని 10గంటల నుంచి 12గంటల వరకు పెంచారన్నారు. కార్మికులు అనేక ఏళ్లుగా పోరాటాలు చేసి 44 చట్టాలను సాధించుకుంటే 15చట్టాలను అడ్రస్ లేకుండా చేసి మిగతా 29చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చేసి కార్మికులకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా చేస్తున్న నరేంద్ర మోదీని గద్దె దించాలని అన్నారు. మేడే జెండా ఆవిష్కరణలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చిన్నక్క, నర్సయ్య, రాజేశ్వర్, దుర్గయ్య, సువర్ణ, మజీద్, బజన్న, గంగు, ముత్తన్న, సురేందర్, దేవన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు;అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ గృహాల పథకంలో అర్హులైన లబ్ధిదారులకే లబ్ధి చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పథకం నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహ నిర్మాణం కోసం ఆర్థిక సహాయం సకాలంలో అందేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు. పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఇంకా అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి వారికి కూడా లబ్ధి చేకూరేలా కృషి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిరుపేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అర్హులైన వారందరికీ ఇళ్లు అందేలా చూడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పని చేసిన బిఆర్ఎస్ పార్టీ

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** తెలంగాణ ప్రజల కోసం పని చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని, కనివిని ఎరుగని రీతిలో రజతోత్సవ సభను నిర్వహిస్తున్నామని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకల సందర్భంగా అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల పాల్గొని విలేకరుల సమావేశంలో రజతోత్సవ సభనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ సభ కుంభమేళను తలపించేలా ఉండబోతుందన్నారు. దేశం మొత్తం తెలంగాణలో నిర్వహించే రజతోత్సవ ఏవడుకను చూసేందుకు తహతహలాడుతున్నారని ఈ సందర్భంగా ప్రజలు రజతోత్సవ వేడుకకు స్వచ్ఛందంగా వచ్చేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారన్నారు. అక్కడి నుండి బయల్దేరిన తర్వాత మార్గమధ్యలో ఓ కళ్యాణ మండపంలో అర్బన్ నాయకులు వారిని రిసీవ్ చేసుకుని భోజనాలు అందజేసి అక్కడి నుండి సభకు బయల్దేరుతామన్నారు.

**బీఆర్ఎస్లో భారీగా చేరికలు:** జిల్లా కేంద్రంలోని 35వ డివిజన్కు సంబంధించిన నరేష్ ఆధ్వర్యంలో వంద మంది యువకులు బీఆర్ఎస్లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులు సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని పార్టీలో చేరినట్లు తెలిపారు.

**గులాబీ టీషర్ట్లతో కార్యకర్తల హంగామా:** రజతోత్సవ వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు గులాబీ టీ షర్ట్స్లు వేసుకుని హంగామా చేశారు. డిజె పాటలు పెట్టుకుని డ్యాన్స్లు చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూకిరణ్, దాదన్నగారి విఠల్రావు, నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్రెడ్డి, పాల్గొన్నారు.

## లక్షలు కురిపిస్తున్న నల్ల బంగారం

**ప్రజాపక్షం /నందిపేట్ :** నందిపేట్ మండలంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతం గోదావరి బేసిన్ నుంచి మట్టి వ్యాపారులు యథేచ్ఛగా నల్లమట్టి తవ్వకాలు జరిపి ఇతర ప్రాంతాలకు అధికారుల అండదండలతో అక్రమ రవాణా జరుపుతు లక్షల రూపాయలు జేబులు నింపుకుంటున్నారు. ఇక్కడినుండి మట్టిని ఒక్కొక్క ట్రిప్పర్ ఏడు నుంచి పదివేల రూపాయలు వ్యాపారులు వసూలు చేస్తున్నారు. ప్రాజెక్టు నల్లమట్టికి విపరీతంగా డిమాండ్ ఉంది. సారవంతమైన మట్టి కావడంతో రైతుల నుంచి వ్యాపారులు ఎక్కువ వసూలు చేస్తున్నారు. పెంట కుప్పలు కొని పొలాలకు, తోటలకు తరలించి పంట భూములు రైతులు కాపాడుకొనేవారు. ప్రస్తుతం ఇవి తగ్గిపోయి నల్లమట్టికి డిమాండ్ పెరిగింది. మండలంలో కొండూరు, బాద్గుణి, డొంకేశ్వర్, నికాల్పూర్, గాదేపల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాలు. ఈ ప్రాంతాల నుంచి వ్యాపారులు జేసిబి, ప్రోక్లెన్ యంత్రాలు పెట్టి లోతుగా తవ్వుతు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామ కమిటిలకు కొంత డబ్బు ఇచ్చి మూడు పువ్వులు, ఆరు కాయలుగా తమ వ్యాపారం చేస్తున్నారు. అధికారులకు ఆశలు చూపి ఎలాంటి అవరోధాలు రాకుండా మట్టి వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఈ విషయంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ప్రభుత్వం త్వరలో ఏకో టూ రిజం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. కలెక్టర్ స్పందించి మట్టి తరలింపు ఆపివేయించాలని గ్రామ ప్రజలు రైతులు కోరుతున్నారు. మట్టి తరలింపు గురించి ఆర్మూర్ అటవీ శాఖ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు మాకు సంబంధం లేదని అన్ని ప్రాజెక్టు అధికారులకే తెలుసునని సమాధానం ఇస్తున్నారు.

## వైరల్గా మారిన పోలీసు వాహనంలో రీల్స్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఓ కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తిని పోలీసులు డిపార్ట్మెంట్ వాహనంలో కోర్టుకు తరలిస్తుండగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వీడియో కాస్తా వైరల్ అయ్యింది. పోలీసు వాహనంలోనే వీడియో తీయడం దానిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ వీడియో ఏకే 46 సమీర్ఖాన్ ఖాతాలో అప్లోడ్ చేశారు. అయితే వాహనం ఏ స్టేషన్కు చెందినది ? వాహనంలో వీడియో తీసింది ఎవరు ? అనేది తేలాల్సి ఉంది.

## ప్రతిఒక్కరూ సెల్ఫోన్లను వాడటంలో అప్రమత్తంగా ఉండాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సిఇఐఆర్ ఫోర్టల్ ద్వారా 60 సెల్ఫోన్ రివకరీ చేసి బాధితులకు అందజేసినట్లు అదనపు పోలీస్ కమీషనర్ శ్రీనివాస్రావు తెలిపారు. ఈ మధ్యకాలంలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో సెల్ఫోన్లు పోయిన వారివి రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు పోలీసు కమీషనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సెల్ఫోన్లను వాడటంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వారి సెల్ఫోన్ పోయినట్లయితే సీఈఐఆర్ ఫోర్టల్ ద్వారా ఆ నెంబర్ను వెబ్సైట్లోకి మళ్లీ అందులో పూర్తి వివరాలు పొందుపర్చాలన్నారు. అలా చేసినట్లయితే త్వరగా వారి సెల్ఫోన్ను రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రజలు ఈ పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా గుర్తు తెలియని వ్యక్తులకు తమ పాత సెల్ఫోన్లను అమ్మవద్దని సెకండ్ హ్యాండ్ సెల్ఫోన్స్ కొన్నట్లయితే వాటి రసీదును తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు. సెల్ఫోన్లు పట్టుకోవటంతో కృషి చేసిన మహిళ 1వ టౌన్ పీసీ డి.అనూష, ఐటి సెల్ సెల్ పీసీ ఆర్.సుష్మాలను పోలీస్ కమీషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఇన్చార్జి మస్తాన్అలీ, ఐటి కోర్, ఆర్ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెస్సీ ఫారంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి;** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో శనివారం దళిత నాయకులు పెద్ద ఎత్తున అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాల నాయకులు ప్రజలు నివాళులు అర్పించారు. ఈ మేరకు దళిత సంఘం మండల అధ్యక్షుడు సూర్యకాంత్ గ్రామంలోని ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఆయన అంబేడ్కర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు సూర్యకాంత్ మాట్లాడుతూ.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి 30 వరకు ఉత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో శనివారం గ్రామంలోని దళిత సోదరులతో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. అంబేడ్కర్ సేవలు, ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.